సాక్షి తిరుపతి

ఆదివారం । 2 । జూన్ । 2024



తల్లిని చూసేందుకు వెళ్తూ..

చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు తండ్రితో కలిసి బైక్‌లో బయలుదేరగా.. లారీ రూపంలో మృత్యువు దూసుకొచ్చింది. - 8లో



రెడ్ జోన్‌లో కౌంటింగ్ కేంద్రం

కౌంటింగ్ కేంద్రమైన శ్రీపద్మావతి మహిళా వర్సిటీ రెడ్ జోన్‌లో ఉన్నట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. - 8లో



బాధితులకు పరామర్శ

సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో చెడువాసన పీల్చి ఆస్పత్రి పాలైన బాధితులను ఎంపీ గురుమూర్తి పరామర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

పాలిసెట్ కౌన్సెలింగ్‌కు 207 మంది హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గత నెల 27నుంచి కౌన్సెలింగ్ కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆరో రోజైన శనివారం 75,001 నుంచి 92 వేల ర్యాంకు వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 207 మంది విద్యార్థులు హాజరై సర్టిఫికెట్లను పరిశీలించుకున్నారు. ఈ కౌన్సెలింగ్‌లో భాగంగా ఆదివారం 92,001 నుంచి లక్షా 8వేల ర్యాంకు వరకు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్టు కళాశాల ప్రిన్సిపల్, పాలిసెట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. కౌన్సెలింగ్‌లో భాగంగా చివరి రోజైన 3వ తేదీ నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 6వ తేదీకి వాయిదా పడిందని, దీనిని విద్యార్థులు గుర్తించాలని కోరారు. అలాగే ఈ నెల 7నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలని, 11వ తేదీన వెబ్ ఆప్షన్స్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, 13వ తేదీన సీట్ల అలాట్‌మెంట్, 14 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపల్ తెలిపారు.

వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలు

–బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి చంద్రశేఖర్ వెల్లడి



బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

తిరుపతి అర్బన్: వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని జిల్లా బీసీ వెల్ఫేర్ ఇన్‌చార్జి జిల్లా అధికారి చంద్రశేఖర్ స్పష్టం చేశారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి చంద్రశేఖర్‌కు జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు ఆయన భాస్కర్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ, మెనూ ప్రకారం రుచికరమైన భోజన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

80.56 శాతం పింఛన్లు పంపిణీ

తిరుపతి అర్బన్: జిల్లాలో సామాజిక భద్రత పింఛన్లు శనివారం నాటికి 80.56 శాతం పంపిణీ చేసినట్టు సంబంధిత అధికారులు తెలిపారు. బ్యాంక్ అకౌంట్‌లేని వారు, 80 ఏళ్ల దాటిన వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. జిల్లాలో 73,819 మందికిగాను తొలి రోజు 59,466 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. మరో రెండు రోజుల్లో వంద శాతం పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఇక బ్యాంక్ ఖాతాలు ఉన్న వారికి సంబంధించి రూ.17.38 కోట్లు డీబీటీ పద్ధతిలో లబ్ధిదారుల ఖాతాల్లో తొలి రోజు జమ చేశామని, మిగిలిన మొత్తాన్ని సోమవారం జమకానుందని అధికారులు స్పష్టం చేశారు.



బాలాంజనేయునికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

హనుమా.. కనుమా!

తిరుమలలో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. జాపాలి తీర్థంలో శ్రీరామ భక్తునికి విశేష పూజలు జరిపించారు. పంచామృతాలతో స్నపన తిరుమంజనం చేపట్టారు. పవిత్ర ఆకాశగంగ వద్ద అంజనాదేవి సన్నిధిలో కొలువైన బాలాంజనేయుని దర్శించుకుని భక్తజనం పులకించారు. ఇరుముడులు సమర్పించి తరించారు. మాల్‌పూరి ప్రసాదం స్వీకరించి పునీతులయ్యారు. శ్రీవారి తరఫున ఈఓ ధర్మారెడ్డి చేతులమీదుగా శేష వస్త్రాలను అందజేశారు. ఆనంద నిలయం ఎదుట విలసిల్లుతున్న బేడీ ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకం చేపట్టారు.

– తిరుమల



జాపాలిలో విశేష పూజలందుకుంటున్న స్వామివారు



ఆకాశగంగలో ఆంజనేయస్వామికి శ్రీవారి తరఫున శేషవస్త్రాలు తీసుకువస్తున్న ఈఓ ధర్మారెడ్డి



ఇరుముడితో స్వామి దర్శనానికి వస్తున్న భక్తులు

తొలి ఫలితం సత్యవేడుదే

‘వివాదాలకు దూరంగా ఉండాలి. కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయాలి. ఈ సారి జిల్లాలో మొదటి ఫలితం సత్యవేడుది కాగా.. తుది ఫలితం వెంకటగిరి నియోజవర్గానిది ఉంటుంది. ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ మరింత కఠినతరం చేస్తాం. ఈనెల 4వ తేదీ ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభిస్తాం. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌ని నిశితంగా పరిశీలిస్తాం’ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, పక్కన ఎస్పీ

144 సెక్షన్ పటిష్టం

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఎగ్జిట్‌పోల్స్ వచ్చిన నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ మరింత పటిష్టం చేసినట్టు కలెక్టర్, ఎస్పీ తెలిపారు. ర్యాలీలు చేపట్టరాదని, పెట్రోల్ విడిగా అమ్మరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత కూడా వారం రోజుల పాటు 144 సెక్షన్ కొనసాగుతుందన్నారు. కౌంటింగ్ సందర్భంగా 4వ తేదీ మద్యం దుకాణాలు మూత వేస్తామన్నారు.

యాప్‌లో అప్‌లోడ్ చేసి..

ఈసారి ఎన్నికల ఫలితాలు వెల్లడించక ముందే అభ్యర్థులకు వచ్చిన ఓట్లను కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన సువిధ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ క్రమసంఖ్య ఆధారంగా ఈవీఎంలను 14 టేబుళ్లలో ఉంచి ఫలితాలను లెక్కించనున్నట్టు తెలిపారు.

చివరి ఫలితం వెంకటగిరిది

- కౌంటింగ్ కేంద్రంలోకి ఫోన్లకు అనుమతి లేదు
- పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ నిశితంగా పరిశీలన
- పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు 15 రౌండ్లలో లెక్కింపు
- కౌంటింగ్‌కు గంట ముందే సిబ్బందికి డ్యూటీల కేటాయింపు
- ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో 144 సెక్షన్ మరింత పటిష్టం
- మీడియాతో కలెక్టర్, ఎస్పీ

తిరుపతి అర్బన్: ప్రశాంతమైన వాతావరణంలో వివాదాలకు దూరంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఆర్వో పెంచల కిషోర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి పార్లమెంట్‌తోపాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 4వ తేదీ మంగళవారం తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 7 గంటలకు స్ట్రాంగ్ రూమ్‌ను నలుగురు అబ్జర్వర్లు, పోటీలో ఉన్న అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామని చెప్పారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. అధికారులకు డ్యూటీలు వేసిన ప్పటికీ ఏ నియోజకవర్గం ఓట్ల లెక్కింపులో పాల్గొనాలనే అంశాన్ని గోప్యంగా ఉంచామని, కౌంటింగ్‌కు గంట ముందు మాత్రమే తెలియజేస్తామని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ విషయంలో నిశితంగా పరిశీలించి నిర్ధారణ చేస్తామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని తేల్చిచెప్పారు.

3.30 గంటలకు తొలి ఫలితం

జిల్లాలో తొలి ఎన్నికల ఫలితం సత్యవేడు నియోజకవర్గానిది వెలువడనున్నట్టు కలెక్టర్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 279 పోలింగ్ కేంద్రాలుండగా.. 14 టేబుల్స్ ద్వారా 20 రౌండ్లలో లెక్కింపు పూర్తిచేయనున్నట్టు పేర్కొన్నారు. సత్యవేడు నియోజకవర్గ ఫలితం మధ్యాహ్నం 3.30 గంటలకే పూర్తి చేస్తామన్నారు. తర్వాత తిరుపతి, చంద్రగిరి, గూడూరు, శ్రీకాళహస్తి ఫలితాలు 3.50 గంటలకు, సూళ్లూరుపేట, వెంకటగిరి ఫలితాలు 4.10 గంటలకు పూర్తికానున్నట్టు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు సంబంధించి సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాలవి మధ్యాహ్నం 12 గంటలకు, తిరుపతి 12.30, చంద్రగిరి ఒంటింగ గంటలకు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు నియోజకవర్గాల్లో మధ్యాహ్నం 2 గంటలకు పూర్తిచేయనున్నట్టు తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి 299 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుల్స్, 22 రౌండ్ల లెక్కింపు చేయాల్సి ఉందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2,891 లెక్కించనున్నట్టు తెలిపారు.

జిల్లా సమాచారం

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాల సంఖ్య	టేబుల్స్	రౌండ్లు
గూడూరు	294	14	21
సూళ్లూరుపేట	304	14	22
వెంకటగిరి	299	14	22
తిరుపతి	274	14	20
శ్రీకాళహస్తి	293	14	21
సత్యవేడు	279	14	20
చంద్రగిరి	397	20	20
మొత్తం	2,140	104	146

పోస్టల్ బ్యాలెట్లు

నియోజకవర్గం	ఓట్ల సంఖ్య	టేబుల్స్	రౌండ్లు
గూడూరు	2,836	3	2
సూళ్లూరుపేట	2,286	4	2
వెంకటగిరి	2,891	3	2
తిరుపతి	4,766	6	2
శ్రీకాళహస్తి	3,052	3	2
సత్యవేడు	1,777	3	2
చంద్రగిరి	5,187	6	3
మొత్తం	22,795	28	15

పక్కాగా పోస్టల్ కౌంటింగ్



సిబ్బందికి సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర

తిరుపతి అర్బన్: పోస్టల్ కౌంటింగ్ పక్కాగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో మరోసారి మోడల్ కౌంటింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల మూడు రోజుల పాటు మోడల్ కౌంటింగ్ కలెక్టరేట్‌లో నిర్వహించారు. అయినప్పటికీ మరోసారి మోడల్ కౌంటింగ్ నిర్వహించి స్బిబందికి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. అనంతరం జేసీ కౌంటింగ్ ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ప్రధానంగా పోస్టల్ బ్యాలెట్ 25 ఓట్లు ఒక కట్టగా కట్టాలని, ప్రతీ టేబుల్‌కు 500 ఓట్లు ఇవ్వనున్నట్టు తెలిపారు. తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు రిటర్నింగ్ అధికారులు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, చంద్రముని, కిరణ్‌కుమార్, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సుశీలాదేవి, ఆర్వోలు, అడిషనల్ ఆర్వోలు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 67,873 మంది స్వామివారిని దర్శించుకోగా 33,532 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శ న టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

డిగ్రీ ఇన్‌స్టంట్, సప్లిమెంటరీ పరీక్షలు వాయిదా

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈనెల 4వ తేదీన జరిగాల్సిన డిగ్రీ 5వ సెమిస్టర్ ఇన్‌స్టంట్ పరీక్ష, 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షను 8వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ దామ్లానాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో సంబంధిత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. అత్యవసర సమాచారాన్ని ఎస్వీయూ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు తెలియజేయడం జరిగిందని, విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

హింసాత్మక ఘటనలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

- కౌంటింగ్‌ను విజయవంతం చేద్దాం
- విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదు
- జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంది
- బాణసంచా విక్రయాలు, పేల్చడం లాంటివి నిషేధం

తిరుపతి అర్బన్: ఎన్నికల కౌంటింగ్ నాడు ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలసి అధికారులతో సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులకు అనుమతి లేదన్నారు. జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉందని గుర్తుచేశారు. బాణసంచా విక్రయాలు, పేల్చడం లాంటివి నిషేధమన్నారు. ప్రతి ఉద్యోగి ఎన్నికల కోడ్‌కు అనుగుణంగా నడుచుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని కౌంటింగ్ కేంద్రానికి సంబంధించిన ఇంజినీరింగ్ భవనాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. పలు గ్రామాల్లో పోలీస్ పికెట్‌లు ఏర్పాటు చేయడం, క్యూఆర్టీ మొబైల్ టీంల ఏర్పాట్లను అప్రమత్తం చేయాలన్నారు. ఎగ్జిట్ పోల్స్ నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల కౌంటింగ్‌లో రిటర్నింగ్ అధికారి నిర్ణయం తుది నిర్ణయమని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద మీడియా కేంద్రం ఏర్పాటు చేశామని, కౌంటింగ్ అథారిటీ లెటర్లు ఉన్న వారిని ఓబీ వ్యాన్‌లను గేట్ వన్ నుంచి అనుమతించనున్నట్టు తెలిపారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి వాహనాలకు అనుమతి లేదన్నారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ బందోబస్తు కోసం విస్తృతమైన ఏర్పాట్లు చేపట్టామని, తగినన్ని క్యూఆర్టీలు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో 2,500 మంది పోలీసు, కేంద్ర సాయుధ బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్టు పేర్కొన్నారు. వెంకటగిరి రిటర్నింగ్ అధికారి, జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ ఉదయం నుంచే కౌంటింగ్ కేంద్రం వద్ద చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి ఆలస్యం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు, అదనపు ఎస్పీలు విమల కుమారి, వెంకట్రావు, కులశేఖర్, రాజేంద్ర, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అరణియార్ పనులు త్వరగా పూర్తిచేయండి



స్పిల్‌వే గేట్లను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్ వెంకటరమణ

పిచ్చాటూరు: అరణియార్ ఆధునికీకరణకు రూ.35 కోట్లతో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ వెంకటరమణ సిబ్బందిని ఆదేశించారు. శనివారం అరణియార్ వద్ద తుడా నిధులు రూ.1.85 కోట్లతో చేపట్టిన పర్యాటక అభివృద్ధి పనులను జిల్లా ఎస్‌ఈ విజయకుమార్‌రెడ్డి, ఈఈ మదనగోపాల్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు స్పిల్‌వే గేట్లు ఆపరేట్ చేసి పరిశీలించారు. ప్రాజెక్టు వద్ద జరుగుతున్న వ్యూటవర్, బోటింగ్ జెట్టీ, చిల్డ్రన్స్ పార్క్ వంటి పర్యాటన అభివృద్ధి పనులు మరో మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. అలాగే జైకా నిధులతో పనులు వేగవంతం చేయాలని గుత్తేదారును ఆదేశించినట్టు పేర్కొన్నారు. వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రాజెక్టు గేట్లు పటిష్టంగా ఉంచాలన్నారు. అరణియర్ డిప్యూటీ ఇంజినీర్ రత్నారెడ్డి, ఏఈలు లోకేశ్వర్‌రెడ్డి, మురళీమోహన్, శివబాల పాల్గొన్నారు.

క్లుప్తంగా

నీటిగుంతలో పడి ఒకరి మృతి


మృతి చెందిన మస్తానయ్య

చిల్లకూరు: తీర ప్రాంతంలోని అద్దెపల్లి సమీపంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాలు.. మండలంలోని చింతవరం గ్రామానికి చెందిన మస్తానయ్య(48) వలస వచ్చి రజక వృత్తి చేస్తున్నాడు. ఈ క్రమంలో అతను బట్టల తీసుకుని అద్దెపల్లి సమీపంలో గల గుంత వద్దకు వెళ్లి అక్కడ ఉతకడం ప్రారంభించాడు. ఇంతలో ప్రమాదవశాత్తు కాలు జారి గుంతలో పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు కొందరు చేపల కోసం గుంతలో వల వేయగా మస్తానయ్య మృతదేహం వలకు చిక్కింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

గూడూరు రూరల్ : గూడూరు రూరల్ పరిధిలోని నెలటూరు చెరువు సమీపంలో రోడ్డు పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ మేరకు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ మనోజ్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహం పడిఉన్న తీరు, అతని శరీరంపై బట్టలు లేక పోవడంలాంటి విషయాలను పరిగిణనలోకి తీసుకున్నారు. మృతుని వయస్సు సుమారు 50 ఏళ్లు ఉండవచ్చని, నడిచి వెళుతుండగా ఏదైనా వాహనం ఢీ కొందా, ఆత్మహత్యకు పాల్పడ్డాడా, ప్రమావశాత్తు జరిగిందా..? అనే కోణాల నుంచి విచారణ చేస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


మృతి చెందిన వృద్ధురాలు

చంద్రగిరి: గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన స్థానిక ఆంధ్రబ్యాంకు సమీపంలోని నూకల గుంట మార్గంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు.. సుమారు 75 ఏళ్లు కలిగిన వృద్ధురాలు మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలి వివరాల కోసం ఆరా తీశారు. ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఎండ దెబ్బకు మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు.

రెడ్ జోన్‌లో కౌంటింగ్ కేంద్రం

- నాలుగు కంపనీల ప్రత్యేక బలగాలతో పటిష్ట భద్రత
- జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, పోలీసు 30 యాక్టు అమలు
- ఎస్పీ హర్షవర్ధన్‌రాజు


పారామిలిటరీ బలగాలతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చంద్రగిరి: కౌంటింగ్ కేంద్ర పరిసరాలను రెడ్ జోన్‌గా ప్రకటించామని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ఎటువంటి భంగం కలిగించకుండా అన్ని పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని కోరారు. ఎన్నికల అనంతరం జిల్లాలో చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక భద్రతా చర్యలను చేపట్టినట్టు వెల్లడించారు. శనివారం రాత్రి ఆయన స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక దళాల బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా సెబ్ డీఎస్పీ రాజేంద్ర, సీఐ రామయ్యకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి భద్రతా చర్యలను తీసుకున్నట్టు తెలిపారు. తిరుపతిలో జరిగిన ఘటన అనంతరం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసుకుని, అన్ని చోట్లా పికిటింగ్, మొబైల్ పోలీసు, ఆర్మ్‌డ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, పారామిలిటరీల ద్వారా గస్తీలను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు. 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో 2,500 మంది పోలీసులు, 3 కంపెనీల సాయుధ బలగాలు, మరో మూడు జిల్లా బలగాలతో నాలుగు అంచెల బందోబస్తును ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కౌంటింగ్ హాలు చుట్టూ ఒకటి, క్యాంపస్‌లో రెండు, బయట ప్రాంతంలో ఒకటి, ఇన్నర్, ఔటర్ ప్రాంతాల్లో ఒక్కొకటి చొప్పున చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బంది, ఏయే మార్గాల్లో చేరుకోవాలో ఇప్పటికే వివరించినట్టు తెలిపారు. జిల్లాలో 144 సెక్షన్, పోలీసు యాక్టు 30 అమలులో ఉన్నాయని గుర్తుచేశారు.

మద్యం, బాణసంచా విక్రయాలపై ప్రత్యేక నిఘా

ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈనెల 3, 4, 5 తేదీలలో మద్యం విక్రయాలను పూర్తిగా నిషేధించినట్లు ఎస్పీ వివరించారు. అయితే కొన్ని చోట్ల మద్యం బల్క్ విక్రయాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో సెబ్ అధికారులు వాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన వివరించారు. జిల్లాలో ఎక్కడా కూడా బాణసంచాలు అధిక మొత్తంలో విక్రయించడానికి వీల్లేదని చెప్పారు. పెట్రోల్, డీజిల్ సైతం లూజులో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు చేపట్టకూడాదని తెలిపారు. సోషల్ మీడియా గ్రూపుల్లో సైతం రాజకీయాలకు సంబంధించిన అభ్యంతకర మెస్సేజ్‌లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే గ్రూపు అడ్మిన్‌లపై కేసులు నమోదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట ఏఎస్పీ కులశేఖర్ ఇతర సిబ్బంది ఉన్నారు.

తల్లిని చూసేందుకు బైక్‌లో వెళ్తూ..

- బైక్‌ను ఢీకొన్న లారీ
- కుమారుడి మృతి
- మృతుడి తండ్రికి తీవ్ర గాయాలు
- పండ్లూరులో తీవ్ర విషాదం


ప్రమాదంలో మృతి చెందిన హర్షిత్ రెడ్డి


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శరత్‌కుమార్ రెడ్డి

నాయుడుపేట టౌన్: అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు తన తండ్రితో కలిసి కుమారుడు బైక్‌లో బయలుదేరాడు. ఇంతలో మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. బైక్‌ను ఢీకొట్టడంతో బీటెక్ చదువుతున్న విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందగా.. మృతుడి తండ్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని పండ్లూరు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. కోట మండలం, వంజివాక గ్రామానికి చెందిన కాపులూరు శరత్‌కుమార్‌రెడ్డి ప్రయివేటు సంస్థలో ఉద్యోగి. 15 ఏళ్ల నుంచి సూళ్లూరుపేట పట్టణంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నాడు. భార్య పవిత్ర, కుమారుడు హర్షిత్‌రెడ్డి(21), కుమార్తె సాయి అక్షయ ఉన్నారు. కుమారుడు హర్షిత్‌రెడ్డి విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ కళాశాలలో బీటెక్ చదువుతుండగా.. కుమార్తె ఇంటర్ చదువుతోంది. తన భార్య పవిత్రకు ఇటీవల అనారోగ్యం కారణంగా గూడూరు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేయడంతో ఆమె అక్కడే ఆస్పత్రిలో ఉంటోంది. ఆమెను చూసేందుకు కుమారుడు హర్షిత్‌రెడ్డితో కలిసి శరత్‌కుమార్‌రెడ్డి బైక్‌లో సూళ్లూరుపేట నుంచి బయలు దేరారు. మార్గమధ్యంలో పండ్లురు గ్రామ జాతీయ రహదారి వద్ద వెనుక నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న కుమారుడు హర్షిత్‌రెడ్డి, వెనుక కూర్చొని ఉన్న తండ్రి శరత్‌కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ గోపి తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన తండ్రి, కుమారుడిని హైవే అంబులెన్స్‌లో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే మార్గ మధ్యంలోనే కుమారుడు హర్షిత్‌రెడ్డి మృత్యువాత పడ్డాడు. తండ్రి శరత్‌కుమార్‌రెడ్డికి ప్రథమ చికిత్స నిర్వహించి, మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హర్షిత్‌రెడ్డి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మిన్నంటిన రోదనలు

ప్రభుత్వ వైద్యశాల వద్దకు మృతుడి కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, స్నేహితులు చేరుకుని మార్చురీ గదిలో నిర్జీవంగా పడి ఉన్న హర్షిత్‌రెడ్డిని చూసి గుండెలవిసేలా రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. కళాశాల విద్యార్థులు వైద్యశాల వద్దకు చెరుకుని కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించగా.. వారు తమ స్వగ్రామమైన వంజివాకకు తీసుకెళ్లారు.

బాధితులకు పరామర్శ


ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి

ఏర్పేడు: రేణిగుంట మండలంలోని బాలాజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి శనివారం పరామర్శించారు. శనివారం మండలంలోని చింతలపాళెం రెవెన్యూలో సీఎంఆర్ ఎకో అల్యూమినియం కర్మాగారంలో చెడు వాసన పీల్చి 36 మందికి పైగా కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వారిని బాలాజీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఎంపీ హుటాహుటిన ఆస్పత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరాతీశారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా నివారించాలని కర్మాగారం యాజమాన్యాన్ని హెచ్చరించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

రైల్వేస్టేషన్‌లో గుర్తుతెలియని మృతదేహం


మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట రైల్వేస్టేషన్, ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం మీద సుమారు 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. రైల్వే ఇన్‌చార్జ్ ఎస్ఐ కే. కొండప్పనాయుడు కథనం.. శనివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ప్లాట్‌ఫాం నంబర్ 1పై ఓ గుర్తు తెలియని వ్యక్తి ఎండకు స్పృహ తప్పి పడిపోయాడని ప్రయాణికులు సమాచారం ఇచ్చారు. వెంటనే రైల్వే డాక్టర్‌ను తీసుకుని వెళ్లే సరికి అప్పటికే ఆ వ్యక్తి చనిపోయి ఉన్నాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడు లైట్ బ్లాక్‌పై వైట్ ఫ్లవర్స్ ఉన్న షర్టు, మెరూన్ కలర్ పెద్ద గళ్ల లుంగీ, తెల్ల బన్నియన్ ధరించి ఉన్నాడు. మృతుడు స్థానికుడై ఉండొచ్చని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు. ఆదివారం సాయంత్రం దాకా చూసిన తరువాత పోస్టుమార్టం నిర్వహించి మున్సిపాలిటీకి అప్పగిస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

వడదెబ్బ తగిలి వృద్ధుడి మృతి


మృతి చెందిన అనంతయ్య

సైదాపురం : వడదెబ్బ తగిలి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని కలిచేడు సమీపంలోని బేతాని చర్చి సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు.. పేరిచర్ల అనంతయ్య (65) వడదెబ్బ తగిలి శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎస్వీ సంప్రదాయ శిల్ప కళాశాలలో ప్రవేశాలు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి గాను సంప్రదాయ కలంకారీ కళలో డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు జూలై 6వ తేదీ వరకు గడువు పెంచినట్లు జేఈఓ. గౌతమి తెలిపారు. కళాశాలలో జూలై 6వ తేదీ వరకు దరఖాస్తులు పొందొచ్చని.. పూర్తి చేసిన దరఖాస్తులను అదేరోజు సాయంత్రంలోపు కళాశాలలో సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 4 సంవత్సరాల డిప్లొమా, 2 సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సులో చేరదలచిన విద్యార్థులు కోర్సుల విద్యార్హతలు, ఇతర వివరాల కోసం www.tirumala.org వెబ్‌సైట్‌ను గాని.. కళాశాల కార్యాలయ ఫోన్ నం.0877–2264637, 9866997290ను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

విద్యుత్ తీగలు తగిలి బాలుడికి గాయాలు


గాయపడిన భరత్‌కుమార్

పెళ్లకూరు: విద్యుత్ తీగలు తగిలి ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని చిల్లకూరు దళితవాడకు చెందిన నెల్లబల్లి భరత్‌కుమార్ ఈనెల 19న స్నేహితులతో కలిసి కాలనీ సమీపంలో క్రికెట్ ఆడుకుంటుండగా బాల్ క్యాచ్ పట్టే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి కాళ్లు, చేతులు, శరీర భాగాలు కాలిపోయాయి. స్థానికులు చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడి వైద్యులు బాలుడి రెండు కాళ్లను శస్త్ర చికిత్స చేసి తొలగించారు. దాంతో బాలుడు భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా విద్యుత్ తీగలు ప్రమాదకర పరిస్థితిలో ఉండడం, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితుని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేపల దుకాణాలు దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గూడూరు రూరల్: పట్టణంలోని చేపల మార్కెట్‌లో ఉన్న నాలుగు దుకాణాలు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.7 లక్షల వరకు నష్టం వాటిల్లినట్టు బాధితులు తెలిపారు. వారి కథనం.. పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో ఉన్న చేపల మార్కెట్ నిర్మాణంలో ఉండగా అదే మార్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ముందు తాత్కాలికంగా చేపల దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో దుకాణంలో ఎండు చేపలతో పాటు, పచ్చి చేపలు నిల్వ చేసుకునేందుకు అవసరమైన ఫ్రీజ్‌లు, తూకాలు ఉన్నాయి. శుక్రవారం రాత్రి యథావిధిగా దుకాణాలను మూసుకుని ఇళ్లకు వెళ్లారు. అయితే ఏమైందో ఏమోగానీ అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పక్కనే ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు మంటలు వ్యాప్తించి ఉంటే పెను ప్రమాదం సంభవించేది.